రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.23, వంకాయ రూ.55, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.26, క్యారెట్ రూ.65, దొండ రూ.25, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.45, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.37, సొరకాయ రూ15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.60, చామగడ్డ రూ.37, మునగ రూ.105, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.50, కీర రూ.17, బీన్స్ రూ.53, క్యాప్సికమ్ రూ.63. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నేడు బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

ఎల్‌బీనగర్: వనస్థలిపురం బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న(నేడు) బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పోచంపల్లి శ్రీధర్, నందిరాజులు లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. వనస్థలిపురం గురుద్వార్ పక్కనున్న రామలయంలో ఉదయం 8 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని అప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.


పార్కులో ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు

ఉద్యానం నిర్వహణ కరువై అధ్వానం

మలక్‌పేట: ఉద్యోగాలు, వివిధ పనుల ఒత్తిడితో కాసేపు రిలాక్స్ అవుదామని పార్కుకు వెళ్తే అక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్కు అంటే వాకింగ్ ట్రాక్, గార్డెనింగ్, పిల్లలకు ఆట వస్తువులు, సీనియర్ సిటిజెన్స్ కూర్చోవడానికి కుర్చీలు, గ్రీనరీ, లైట్లు లాంటి సౌకర్యాలు ఉండాలి. కానీ.. మూసారంబాగ్ డివిజన్ పరిధి గాంధీ నగర్ కాలనీ పార్కులో చెత్త చెదారం, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలే దర్శనం ఇస్తాయి. ఈ పార్కు అభివృద్ధికి నోచుకోకపోవడంతో స్థానికులు పక్క కాలనీ పార్కుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ అధికారులు పట్టించుకోకపోవడంతో పార్కుకు తాళం వేయాల్సిన దుస్థితి నెలకొంది. పార్కులో ఎలాంటి వసతులు లేక సందర్శకులు రాకపోవడంతో శుభ్రత లేని కారణంగా, క్రిమి కీటకాలు, విష సర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, నిధులు కేటాయించి పార్కును అభివృద్ధి చేయాలని ఆయా ప్రాంతాల వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



పార్కు గేటుకు తాళం వేసిన దృశ్యం

వరద కాలువ పనులు పునఃప్రారంభం


ప్రారంభమైన వరదనీటి కాలువ పనులు

సాక్షి ఎఫెక్ట్..

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ హస్తినాపురం డివిజన్ పరిధిలోని పిండి నారాయణరెడ్డి కాలనీలో చేపట్టిన పలు పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో స్థానికులు నానా ఇక్కట్లకు గురయ్యేవారు. పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. సమస్యపై ఈ నెల 12న 'అసంపూర్తి పనులతో అవస్థలు' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి వరదనీటి కాలువ పనులను పునఃప్రారంభించారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన సాక్షికి ఆయా కాలనీలవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

చర్చిల మరమ్మతుకు విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ ఫేజ్–1, ఎన్టీఆర్‌నగర్‌లోని 50 యార్డ్స్‌లోని బాప్టిస్ట్ చర్చిల మరమ్మతుల కోసం రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపేందర్‌రెడ్డి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే క్రిస్మస్ వేడుకలు అందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాషువా, లింకాన్, రమేష్, అశోక్, శశి, జహంగీర్, రాజు, అనిల్ పాల్గొన్నారు.

రైతుల మేలుకు కమిటీ కృషి చేయాలి


ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సత్కరిస్తున్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: మార్కెట్‌కు వచ్చే రైతుల మేలు కోసం పాలకవర్గం కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పాలకవర్గం డైరెక్టర్లతో కలిసి భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌లో రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, వ్యాపారులకు రైతులకు అనుసంధాన కర్తలుగా ఉండి ఇరువురికి మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించినట్లు సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్‌నగర్ శృంగేరి కాలనీలోని ప్రభుత్వ స్థలంలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు శనివారం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కొత్తపేట డివిజన్ పరిధిలోని స్థలంలో గతంలో ప్రభుత్వం స్థలమంటూ బోర్డు ఉండేదని కొంత మంది ఆక్రమించి గోడలు నిర్మించుకున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తాం


పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎంపీ ఈటల రాజేందర్

ఎల్‌బీనగర్: పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు.హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సూర్యనగర్, ఇన్స్పెక్షన్, సత్యనారాయణ, వేంకటేశ్వర, సుష్మ సాయినగర్ కాలనీల్లో రూ.3.26 కోట్లు, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని హరిహరపురం కాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీ, శ్రీపురం కాలనీ ఫేజ్‌లలో రూ.1.26 కోట్లతో చేపట్టనున్న వివిధ పనులకు శనివారం వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, నాయకులు అరవింద్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నవకిషోర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రావు, ఎల్లప్ప పాల్గొన్నారు.

మొదట ఎంపీ, ఎమ్మెల్యేల వివరాలు సేకరించాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో జరిగే సమగ్ర సర్వేలో ఎమ్మెల్యే, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు ముందుగా వాళ్ల సర్వే చేయించిన తర్వాతే ప్రజల సర్వే చేయాలి సీపీఎం ఆర్‌కేపురం డివిజన్ కార్యవర్గ సభ్యులు కట్ట శ్రీనివాస్, ఎం.గోపినాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఎన్టీఆర్‌నగర్ సీపీఎం పార్టీ శాఖ ఆధ్వర్యంలో సర్వేపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎమ్మెల్యే ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధుల సర్వేలను చేయించి మీడియా ముందు వారి ఆస్తుల వివరాలు ప్రకటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు హామీలను డైవర్ట్ చేయడానికే సర్వే అంటున్నారన్నారు.ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, వినోద్, ముస్తఫా, చంద్రకళ, పాల్గొన్నారు.

సహకార సంఘాలతో ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న రోజారాణి

చాదర్‌ఘాట్: సహకార సంఘాలతో విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని గోల్కొండ కోఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ టి.రోజా రాణి, గన్‌ఫౌండ్రీ కోఆపరేటివ్ సొసైటీస్ జాయింట్ రిజిస్ట్రార్ ఆర్.సంగీత, నాంపల్లి కోఆపరేటివ్ సొసైటీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎల్.శారదాంబ పేర్కొన్నారు. 71వ జాతీయ కోఆపరేటివ్ వారోత్సవాలను పురస్కరించుకొని తిరుమల బ్యాంక్ ఫౌండర్ చైర్మన్ నంగునూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మలక్‌పేట తిరుమల బ్యాంక్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంలో వినియోగదారులు వెన్నెముక అని పేర్కొన్నారు. దివంగత మాజీ ప్రధాని నెహ్రూ కోఆపరేటివ్ రంగాల కోసం చట్టాలను తీసుకొచ్చారని గుర్తుచేశారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఈ సందర్భంగా చంద్రశేఖర్ పేర్కొన్నారు.

శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న శశిధర్‌రెడ్డి

లింగోజిగూడ: హయత్‌నగర్ కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న బార్ అసోసియేషన్ భవనానికి శనివారం రంగారెడ్డి జిల్లా సెషన్స్ జడ్జి శశిధర్‌రెడ్డి శంకుస్థాన చేశారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ కోర్టు జూనియర్ సివిల్, 14ఎంఎం అడిషనల్ జడ్జి సల్మా ఫాతిమా, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, 14ఎంఎం కోర్టు సూపరింటెండెంట్ ధార రాములు, 7ఎంఎం కోర్టు సూపరింటెండెంట్ శారద, సీఐలు శ్రీనివాస్‌రావు, నాగరాజు గౌడ్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌స్టాలో పరిచయం.. ఆపై వేధింపులు

లింగోజిగూడ: ఇన్‌స్టాలో పరిచయమై ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని ఓ యువతి ఫిర్యాదు చేసిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌కు చెందిన యువతి నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ చేస్తుంది. కొన్నిరోజుల క్రితం హయత్‌నగర్‌కు చెందిన చేరపల్లి విజయ్‌తో సదరు యువతికి ఇన్‌స్టా ద్వారా పరిచయం ఏర్పడి స్నేహంగా మారడంతో ప్రేమించాలని వెంటపడడంతో ఆమె దూరం పెట్టింది. తనను ప్రేమించాలని లేకపోతే మనం కలిసి ఉన్న ఫొటోలను మార్ఫింగ్ చేసి పోస్ట్ చేస్తానని బెదిరింపులకు పాల్పడటంతో శనివారం యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పార్ట్‌టైం ఉద్యోగం పేరుతో రూ.32,314 టోకరా

నాగోలు: పార్ట్ టైం ఉద్యోగం పేరుతో ఓ యువకుడి నుంచి డబ్బులు కాజేసిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. మన్సూరాబాద్‌కు చెందిన ఉప్పునూతల అంజనేయులు టెలిగ్రాం యాప్‌లో పార్ట్‌టైం ఉద్యోగం కోసం సెర్చ్ చేస్తూ ఓ లింక్ ఓపెన్ చేశాడు. కొన్ని డబ్బులు పెట్టుబడి పెడితే వర్క్ ఇస్తామని ఉండడంతో అతని ఐడీబీఐ బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు బదిలీ చేశాడు. ఆ తరువాత రూ.22,314 పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయనడంతో ఆ డబ్బులు పంపించాడు. ఎలాంటి స్పందన రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి ఫిర్యాదు చేశాడు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి


చెక్కు అందజేస్తున్న దృశ్యం

నాగోలు: పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జైపురి కాలనీ పాఠశాలకు సంగారెడ్డి జిల్లా కల్హేరు మండల విద్యాధికారి గంజి శ్రీనివాస్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, మల్లేష్ బీరువా కోసం జైపురికాలనీ ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలకు దాతలు సహకరించాన్నారు. పాఠశాల కమిటీ చైర్ పర్సన్ వరలక్ష్మి మాట్లాడుతూ.. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలింపు



మలక్‌పేట: మతిస్థిమితం లేని గుర్తు తెలియని ఓ వ్యక్తిని మలక్‌పేట పోలీసులు ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. అఫ్జల్‌నగర్, తీగలగూడ ప్రాంతాల్లో తిరుగుతూ ఇంటి తలుపులు తట్టడం, మూత్ర విసర్జన చేయడం, ప్రజలపై రాళ్లు రువ్వడంతో భయభ్రాంతులకు గురైన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా శనివారం ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించినట్లు ఎస్సై తెలిపారు.

సమగ్ర సర్వేపై అధికారుల ఆరా


సర్వేను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి


కులగణను పరిశీలిస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–6లో కొనసాగుతున్న కుటుంబ సమగ్ర సర్వేలో 16,009 కుటుంబాల వివరాలు సేకరించినట్లు నోడల్ అధికారి సంజయ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 23 శాతం మాత్రమే పూర్తయిందని, ఇంటి చిరునామాలతో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటిని అధిగమించుతామన్నారు. డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సర్వే ప్రక్రియపై ఆరా తీశారు.

హయత్‌నగర్ సర్కిల్‌లో..

లింగోజిగూడ: హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని నాగోలు డివిజన్ సాయి నగర్ కాలనీలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను శనివారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ ఐఏఎస్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనాలు చేశారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య, డిప్యూటీ ప్రాజెక్ట్ అధికారి బలరాం పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితులకు అండగా ఉంటాం


మూసీ నిర్వాసితులతో కలిసి భోజనం చేస్తున్న లక్ష్మణ్

మలక్‌పేట: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'మూసీనిద్ర'లో భాగంగా మూసారంబాగ్ డివిజన్‌లో బీజేపీ నాయకులు పర్యటించారు. శనివారం ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదనన్‌రెడ్డి, కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీతో కలిసి న్యూ ఈస్ట్‌ప్రశాంత్‌నగర్, ఫ్రెండ్స్‌కాలనీ, అజేయ్ హట్స్, శాలివాహననగర్ వాంబే కాలనీల్లో పర్యటిస్తూ మీడియాతో మాట్లాడారు. బీజేపీ మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ తీర ప్రాంతవాసులను భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. కాయకష్టం, అప్పుసొప్పు చేసి కట్టుకున్న ఇళ్లను ఎప్పుడు ఎవరొచ్చి కూల్చుతారో అంటూ ప్రజలకు ఆందోళన చెందుతున్నారన్నారు. మూసీ బాధితులకు అండగా నిలిచి పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం బాధితులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, హరిగౌడ్, వంజరి వినోద్, గజానంద్, భరత్, ప్రవీన్‌యాదవ్, రాజేశ్వర్‌రావు, ఎల్ బీశాస్త్రి, నరేష్‌యాదవ్, సురేందర్ పాల్గొన్నారు.

చైతన్యపురిలో..


బాధితులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

చైతన్యపురి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడి హైదరాబాద్ వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం ఆయన మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి మాట్లాడారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేయటమే కాక పేదల ఇళ్లను కూల్చడం అన్యాయమన్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని ఇంకా డీపీఆర్ కూడా సిద్ధం కాకుండా ప్రాజెక్టుకు లక్షన్నర కోట్ల బడ్జెట్ అనడంలో మతలబేంటని ప్రశ్నించారు. దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న పేదలతో ఒక్కరోజు నిద్ర చేయండి అని సీఎం సవాల్‌ను స్వీకరించి బీజేపి ఆధ్వర్యంలో మూసీనిద్ర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సామరంగారెడ్డి, కార్పొరేటర్లు రంగా నర్సింహగుప్తా, పవన్‌కుమార్, లచ్చిరెడ్డి, రాధా ధీరజ్‌రెడ్డి, నాయకులు వినోద్‌యాదవ్, రాజేష్, శ్రీనివాసరావు, సురేందర్‌యాదవ్, రుద్రారపు శంకర్, వేణుగోపాల్, రాంరెడ్డి, సునీతారెడ్డి పాల్గొన్నారు.

పంచకులాల వారిని విశ్వకర్మలుగా గుర్తించాలి

ఎల్‌బీనగర్: పంచకులాల వారిని విశ్వకర్మలుగా గుర్తించాలని అఖిల భారత విశ్వకర్మ మహాసభ ఆధ్వర్యంలో శనివారం మల్కాజిగిరి ఎంపీ ఈటలను కలిసి వినతి పత్రం అందజేశారు. అధ్యక్షులు కౌలే జగన్నాథం మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో కమ్మరి, వడ్రంగి, స్వర్ణకార, కంచర, శిలాశిల్పి వృత్తుల వారిని విశ్వకర్మలుగా ఆమోదించాలన్నారు. లింగాచారి, మురళీధర్, లక్ష్మణాచారి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భారతీ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతం



మన్సూరాబాద్: భారతీ అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని సంస్థ టెక్నికల్ ఇంజనీర్ బద్రీ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి లెక్చరర్స్‌కాలనీలోని శ్రీకృష్ణ స్టీల్ ట్రేడర్స్‌లో శనివారం తాపీ మేస్త్రీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతీ సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ 'ఫైవ్‌స్టార్' గ్రేడ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపికన్నారు. డీలర్ నరేష్ మాట్లాడుతూ.. భారతీ సిమెంట్ సంస్థ సర్వీస్ వేగవంతంగా ఉందన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కారుణ్య సింధు ఆశ్రమ రజతోత్సవం

సైదాబాద్: అరక్షిత బాలురులను ఆదరించి వారికి కారుణ్య సింధు ఆశ్రమంలో ఆశ్రయం అందించి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని అధ్యక్షుడు ఆచార్య కదారి సత్యమూర్తి తెలిపారు. ఐఎస్‌సదన డివిజన్ కృష్ణానగర్‌లోని ఆశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆశ్రమ కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వర్లుతో కలిసి మాట్లాడారు. 1999లో ఐదు మందితో ప్రారంభమైన ఆశ్రమంలో ఇప్పటి వరకు 250 మంది బాలలను వారి జీవితాల్లో స్థిరపడేలా శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుతం ఆశ్రమంలో 55 మంది అరక్షిత బాలురులు ఉన్నారని తెలిపారు. ఆశ్రమ రజతోత్సవ వేడుకలను ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్‌లోని వినయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్నామన్నారు.

33 మంది మహిళల బైండోవర్

నాగోలు: రాత్రి వేళల్లో రోడ్లపై అసభ్యకరంగా ప్రవరిస్తూ రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులకు గురిచేస్తున్న 33 మంది మహిళలను సరూర్‌నగర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య తెలిపారు. గత మూడ్రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 33 మంది మహిళలను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించి బైండోవర్ చేశామన్నారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే భారీ జరిమానాలతో జైలు శిక్ష విధిస్తామని తహసీల్దార్ హెచ్చరించినట్లు తెలిపారు.

లక్ష దీపోత్సవం



ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని కన్యాకా పరమేశ్వరి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి కార్తీక లక్షదీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వందలాది మంది మహిళలు పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌గుప్తా, అంజయ్య గుప్తా, కృష్ణయ్య, శ్రీధర్, అరుణ్, సుదర్శన్, సుజాత, మధుర, అరుణ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.
– దిల్‌సుఖ్‌నగర్